# రోమీయులకు వ్రాసిన పత్రిక 2వ అధ్యాయము

## యూదులు కూడ పాపమునకు లోనైన వారే

కాబట్టి తీర్పు తీర్చు మనుష్యుడా, నీవెవడవైనను సరే నిరుత్తరుడవై యున్నావు. దేని విషయములో ఎదుటి వానికి తీర్పు తీర్చుచున్నావో దాని విషయములో నీవే నేరస్థుడవని తీర్పు తీర్చుకొనుచున్నావు. ఏలయనగా తీర్పుతీర్చు నీవును అట్టి కార్యములనే చేయుచున్నావు కావా ? 2 అట్టి కార్యములు చేయువారి మీద దేవుని తీర్పు సత్యమును అనుసరించినదే అని యెరుగుదుము. 3 అట్టి కార్యములు చేయువారికి తీర్పు తీర్చుచు వాటినే చేయుచున్న మనుష్యుడా, నీవు దేవుని తీర్పు తప్పించుకొందువని అనుకొందువా? 4 లేదా, దేవుని అనుగ్రహము మారుమనస్సు పొందుటకు నిన్ను ప్రేరేపించుచున్నదని ఎరుగక ఆయన అనుగ్రహైశ్వర్యమును సహనమును, దీర్ఘశాంతమును, తృణీకరించుదువా? 5 నీ కాఠిన్యమును, మార్పుపొందని నీ హృదయమును అనుసరించి ఉగ్రతదినమందు అనగా దేవుని న్యాయమైన తీర్పు బయలుపరచబడు దినమందు నీకు నీవే ఉగ్రతను సమకూర్చు కొనుచున్నావు. 6 ఆయన ప్రతివానికి వాని వాని క్రియల చొప్పున ప్రతి ఫలమిచ్చును. 7 సత్క్రియలు ఓపికగ చేయుచు, మహిమను, ఘనతను అక్షయతను వెదకువారికి నిత్యజీవమునిచ్చును. 8 అయితే భేదములు పుట్టించి సత్యమునకు లోబడక, దుర్నీతికి లోబడు వారి మీదికి దేవుని ఉగ్రతయు, రౌద్రమును వచ్చును. 9 దుష్కార్యము చేయు ప్రతి మనుష్యుని ఆత్మకు మొదట యూదునికి గ్రీసు దేశస్తునికి కూడ శ్రమయు వేదనయు కలుగును. 10 సత్క్రియ చేయు ప్రతి వానికి మొదట యూదునికి, గ్రీసు దేశస్తునికి కూడ మహిమయు, ఘనతయు సమాధానమును కలుగును. 11 దేవునికి పక్షపాతము లేదు. ధర్మశాస్త్రము లేక పాపము చేసిన వారందరు ధర్మశాస్త్రము లేకయే నశించెదరు. 12 ధర్మశాస్త్రము కలిగినవారై పాపము చేసిన వారందరు, ధర్మశాస్త్రానుసారముగా తీర్పు నొందుదురు. 13 ధర్మశాస్త్రము వినువారు, దేవుని దృష్టికి నీతిమంతులు కారు గాని, ధర్మశాస్త్రము ననుసరించి ప్రవర్తించువారే నీతిమంతులుగా ఎంచబడుదురు. 14 ధర్మశాస్త్రము లేని అన్యజనులు స్వాభావికముగా ధర్మశాస్త్రమునకు సంబంధమైన క్రియలు చేసిన యెడల వారు ధర్మశాస్త్రము లేని వారైనను, తమకు తామే ధర్మ శాస్త్రమైనట్టున్నారు. 15 అట్టివారి మనస్సాక్షి కూడ సాక్షమిచ్చుచుండగను, వారి తలంపులు ఒకదాని మీద ఒకటి తప్పు మోపుచు, లేక తప్పులేదని చెప్పుచుండగను, ధర్మశాస్త్ర సారము తమ హృదయములయందు వ్రాయబడినట్టు చూపుచున్నారు. 16 దేవుడు నా సువార్త ప్రకారము యేసుక్రీస్తు ద్వారా మనుష్యుల రహస్యములను విమర్శించు దినమందు ఈలాగు జరుగును.

17 నీవు యూదుడవని పేరు పెట్టుకొని ధర్మశాస్త్రమును ఆశ్రయించి దేవుని యందు అతిశయించుచున్నావు కావా? 18 ఆయన చిత్తమెరిగి ధర్మశాస్త్రమందు ఉపదేశము పొందినవాడవై, శ్రేష్టమైన వాటిని మెచ్చుకొనుచున్నావు కావా? 19 జ్ఞాన సత్య స్వరూపమైన ధర్మశాస్త్రము గల వాడవైయుండగా- నేను గ్రుడ్డివారికి త్రోవ చూపువాడను, 20 చీకటిలో నుండు వారికి వెలుగును, బుద్ధిహీనులకు శిక్షకుడును, బాలురకు ఉపాధ్యాయుడనై యున్నానని, నీ యంతట నీవే ధైర్యము వహించు కొనుచున్నావు కావా? 21 ఎదుటి వానికి బోధించు నీవు నీకు నీవే బోధించుకొనవా? దొంగిలవద్దని ప్రకటించు నీవు దొంగిలెదవా? 22 వ్యభిచరింపవద్దని చెప్పు నీవు వ్యభిచరించెదవా? విగ్రహములను అసహ్యించుకొను నీవు గుళ్ళను దోచెదవా ? 23 ధర్మశాస్త్రమందు అతిశయించు నీవు ధర్మశాస్త్రము మీరుట వలన దేవుని అవమాన పరచెదవా? 24

వ్రాయబడిన ప్రకారము మిమ్మును బట్టియే గదా దేవుని నామము అన్యజనుల మధ్యను దూషింపబడుచున్నది? 25 నీవు ధర్మశాస్త్రము ననుసరించి ప్రవర్తించువాడవైతివా, సున్నతి ప్రయోజనకరమగునుగాని ధర్మశాస్త్రమును అతిక్రమించువాడవైతివా, నీ సున్నతి సున్నతి కాకపోవును. 26. కాబట్టి సున్నతి లేనివాడు ధర్మశాస్త్రపు నీతివిధులను గైకొనినయెడల అతడు సున్నతి లేని వాడైయుండియు సున్నతి గలవాడుగా ఎంచబడును గదా? 27. మరియు స్వభావమును బట్టి సున్నతి లేనివాడు ధర్మశాస్త్రమును నెరవేర్చిన యెడల, అక్షరమును సున్నతియు గలవాడవై, ధర్మశాస్త్రము నతిక్రమించు నీకు తీర్పు తీర్చడా? 28. బాహ్యమునకు యూదుడైన వాడు యూదుడు కాడు శరీరమందు బాహ్యమైన సున్నతి సున్నతి కాదు 29. అయితే అంతరంగమందు యూదుడైన వాడే యూదుడు. మరియు సున్నతి హృదయ సంబంధమైనదై, ఆత్మ యందు జరుగునదే గాని అక్షరము వలన కలుగునది కాదు. అట్టి వానికి మెప్పు మనుష్యుల వలన కలుగదు దేవుని వలననే కలుగును.